# రూల్స్ మహిమ

"అదండీ యిసయం!"

"దరమాసుపత్తిరేనండి....."

"గవొర్మెంటుదండి-"

"పోయిన ఎలచ్చన్ల ముందెట్టేరండి! మరి నేకుంటే వోట్లు ఎయ్యం.డి. అంచాత అరజంటుగా ఎట్టేసి వోట్లు ఏయించేసుకున్నారండి."

"తొల్త మొగడాట్టర్ని ఏసినారు-"

"ఆభావు శానమంచోడు! పగ.. నేతిరి యిశచ్చన్నేదు."

"డూటీ ఎక్కినా ఎక్కకపోయినా సూసేవాడండీ!"

"గవొర్మెంటు డాట్టరునా గాదండి!"

"నువు గవొర్మెంటు ఆసుపత్తిరికి ఎల్లండి -"

"ఏటవుద్ది?"

"పేరు వూరు అడుగుతారండి!"

"వా.సండి."

"మరి ఆడో మొగో సెప్పాలండి."

"నీరోగవేటో ఎందుకొచ్చిందో అడగతారండి."

"ఇవరాలన్నీ సెప్పాలండి."

"సిట్టాలో ఏసిత్తారండి"

"నువు సొమ్ము వొట్టుగొచ్చినావో నేదో సెప్పాల"

"నీకాడ సొమ్ముంటే మరి భయం నేదండి"

"డాట్టరు భావే నీకు సాయంగా మందేత్తాడండి. నువు వొద్దన్నా సూదిమందిత్తాడండి.

కుసీగా కబర్లాడతాడండి."

"నీకాడ సొమ్ము నేదంటే సీటీరాసి సేతలెట్టి అవతల బొమ్మంటాడండి. మరి నీదిక్కు సూడ్డండి!"

"మరి ఈభావు యిసయం ఏరండీ!"

"రోగవేటో పూరాగా తనికీసేసి మందిత్తారండి,"

"సూది మందియ్యడండి. సేదుమందు యిత్తాడండి. సూదిమందుకంటే గునం జాత్తి."

"ఈ డాట్టరుబావు అన్దరికీ యిరోదమండి! పెద్దోరికండి."

"ముప్పొద్దుల పెసినెంటుగోరింటి కెల్లాలండి. రోగం వున్నా నేకపోయినా తనికీ సెయ్యాలండి. సెయిర్మెను గోరింటి కెల్లాలండి. పోతే నెంబర్లింటి కెల్లాలండి."

"మరి ఈభావు ఎల్లు! నాకాడ కొత్తే సూత్తానంటాడండి."

"అదండీ యిరోదం!"

"పెసిడెంటుగోరి కోడలు నెల్లప్పిందండి. పట్నం బొట్టండి."

"మొగడాట్టరు కాడకెల్ను నేడీ డాట్టరుగావాలందండి."

"మరందేటండి?"

"కన్నారూర్ల యీదికో డాట్టరు! నువు నేడీడాట్టర్ను తేనేకపోతే కన్నారింటికి ఎల్లిపోతాను తోలీమంది.

"పెసిడెంటుగోరికి సిన్తం ఏసి తలదీసేసినట్టయిందండి."

"ఈ డాట్టరుభావు నాబంనేదు పిరాయించేసి నేడీ డాట్టరును అరజంటుగా తోలేమని పిటీషను ఒగ్గేసినాడండి పెసిడెంటుగోరు."

"పెసిడెంటుగోరికి బలగం శానా వుందండి. మూడోనాటికి ఫిరాయించేసినారండి."

"నేడీ డాట్టరొచ్చిందండి!"

"సక్కదనాల సుక్కండి! జున్నుముక్కనాగుంటాదండి! శానా సురుకండి."

"పెద్దానికి సిన్దానికి సూది మందేసేత్తాదండి."

"ఓసుట్టు ఏటయిందంటే? అరజంటు డెలివరీ కేసొచ్చిందండి."

"ఎరకయ్య గాడింటి దానికండి."

"పెద్దపేనం నిలుస్తందా? నిల్దా? బయం ఎట్టేసుకున్నారండి వూర్ల పెజలు డాట్టరమ్మ శానా కట్టబడిందండి" పెద్దపేనం సిన్నపేనం కాసిందండి."

"అదే టయంలో సెయిర్మెనుగోరికి పెసిడెంటుగోరికి నేడీ డాట్టరు పని పడిదండి.

"డాట్టరమ్మ ఆసుపత్తిరికాడ నేదండి."

"బేగొచ్చీమని కబురంపేరండి"

"రానేదు"

"ఒచ్చేక పేసీ ఎట్టేరండి."

"నువు డూటీ టయాంల సెక్కర్లు కొడతన్నావ్ ఈడ పేసెన్టు వొగ్గేసి బైటకెల్లగూడదు. ఈడకొచ్చినవోర్నే సూడాల. అది రూలు. అన్జెప్పి కూకలేసేరండి.

"నీరూలేటో నాకుతెల్దు! అరజంట్ కేసయితే పేనం మీదకొత్తే ఎల్తాను. ఎల్లకుండా వొగ్గేమంతావేటి అని నిలదీసింది.

"ఏదేటయినా డూటీ టయాంల నువు సెక్కర్లు కొట్టకూడదు. ఈడకొత్తేనే సూడాల కూకలేసినారండి. పెసిడెంటుగోరు, సెయిర్మెనుగోరు.

"పెద్దోల్లకున్న రోగవేయిది!" పేదోల్లు సల్లగుంతే సూడ్నేరు. అంచాత ఈల్ల రోగం నానే కుదర్చాలని డూటీ టయాం పెకారం కరకట్టుగా సేసేసిందండి."

ఓసుట్టు జామురేతిర్ని పెసిడెంటుగోరి బొట్టికి గొట్టాలమ్మొచ్చిందండి. సెయిర్మెనుగోరి కోడలండి. యిరోసినాలు వాంతులు వొగ్గనేదండి. కాల్సేతులు సల్లబడి నేలోడీసినారండి."

"పెసిడెంటుగోరు డాట్టరమ్మని అరజంటుగా రమ్మని కబురుతోలేసినారండి."

"నాను డూటీలో నేను రేపు పెందిలికాడే డూటీ ఎక్కేక ఆసుపత్తిరికాడకు వొత్తే సూత్తాను ఎల్లిపొమ్మందండి

"పేనం నిలవదండి! గడియో సెనమో నాగుందండి,"

"అంచాత పెసినెంటుగోరు సెయిర్మెనుగోరు డాట్టరమ్మ యింటికి పారొచ్చేసి నారండీ.'

"మీరేసిన రూలే! నానేటి సేసేది అందండి."

"పెసినెంటుగోరు, సెయిర్మెనుగోరు తప్పొప్పేసుకొని బొట్టిని రచ్చించమన్నారండి."

"ఆరికప్పుడు దెల్సొచ్చిందండి పేనం యిలువ రూల్సు మగిమ,"

"అదండీ యిసయం."

("జనసుధ" వారపత్రిక 9-3-1979) ✪